ధాన్యం దళారుల పాలు


ధాన్యాన్ని లారీలోకి ఎక్కిస్తున్న కూలీలు

- కొనుగోలు కేంద్రాల్లో అమ్మేది అంతంత మాత్రమే
- ప్రైవేట్‌కే మొగ్గు చూపుతున్న రైతులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం దళారుల పాలవుతోంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా కూడా రైతులు ఆసక్తి చూపడం లేదు. గతంలో మద్దతు ధర పలకడంతో కొనుగోలు కేంద్రాల్లో నేనూ..నువ్వు అంటూ కాటా పెట్టే వారు. పంటలు చేతికి వచ్చే సమయంలోనే ఎన్నికలు వచ్చాయి. దీనితో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే డబ్బులు సకాలంలో పడతాయో లేదో అన్న సందేహం రైతుల్లో నెలకొంది. అంతే కాకుండా గత ఏడాది అకాల వర్షాల వలన పంట నష్టం జరిగింది. దీనితో రైతులు దళారులకే అమ్మడం మొదలు పెట్టారు. అటు ధాన్యం పచ్చివే రూ.2100 క్వింటాలు పలకడంతో ఎండ పోయడానికి కూలీల ఖర్చులు మిగులు తాయని దళారులకే అమ్ముతున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి. దళారులను నమ్మి విక్రయించడం వల్ల సొమ్ముకు గ్యారెంటీ ఉండదు.

. –పెర్క శ్రీనివాస్, మైలారం పీఏసీఎస్ చైర్మన్

రైతుల సొమ్ము భద్రమేనా?

దళారులను నమ్మి రైతులు కాంటా పెడుతున్నారు. అయితే దళారులను నమ్మి రైతులు మోసపోయిన ఘటనలు చాలానే ఉన్నాయి. అయినా కూడా రైతులు విక్రయిస్తున్నారు. 20 రోజుల క్రితం ధాన్యం విక్రయించినా కూడా ఇంత వరకు డబ్బులు ఖాతాల్లో పడలేదు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే నిర్ణీత సమయంలోనే డబ్బులు పడతాయి.

కారు గుర్తుకు ఓటేస్తేనే సంక్షేమ పథకాలు

- జుక్కల్ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే


సోమూర్‌లో ప్రచారం చేస్తున్న హన్మంత్ సింధే

మద్నూర్(జుక్కల్): ప్రజలు కారు గుర్తుకు ఓటు వేస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని కాంగ్రెస్, బీజేపీని నమ్ముకుంటే పథకాలు ఉండవని జుక్కల్ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్‌సింధే పేర్కొన్నారు. పెద్ద తడ్గూర్, చిన్న తడ్గూర్, అంతాపూర్, సోమూర్, దన్నూర్ గ్రామాల్లో గురువారం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి హన్మంత్‌సింధే ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నో సంవత్సరాల నుంచి అధికారంలో ఉన్న రెండు జాతీయ పార్టీల నాయకులు తెలంగాణను మోసమే చేశారు తప్ప మంచి చేయలేదన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని వారి చేతిలో పెట్టకుండా బీఆర్ఎస్‌కే మద్దతు పలకాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు బస్సీ పటేల్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురేశ్, సొసైటీ చైర్మన్ శీను పటేల్, తదితరులున్నారు.

పార్టీలకతీతంగా కార్పొరేషన్ కోసం పోరాడుదాం

కామారెడ్డి టౌన్: ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు కోసం పార్టీలకు అతీతంగా పోరాటం చేయాలని కామారెడ్డి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. కొందరు బీఆర్ఎస్‌కు చెందిన ఆర్యవైశ్య నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్, కేసీఆర్, కేటీఆర్‌లు ఆర్యవైశ్యులకు చేసిందేమి లేదన్నారు. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే బీఆర్ఎస్ నాయకులకు నేరుగా పాలాభిషేకాలు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం బీజేపీనే 10 శాతం రిజర్వేషన్‌తో ఆర్యవైశ్యులను ఆదుకుంటుందని గుర్తు చేశారు. తాము బీజేపీ తరుపున మాట్లాడటం లేదని ఆర్యవైశ్య సమాజం మేలు కోసం కార్పొరేషన్ కావాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మహేష్‌గుప్తా, భూమేష్‌గుప్తా, గజేందర్, గంగాధర్, వీరేశం, యాద రవి ఉన్నారు.

అవినీతి పాలనను అంతం చేద్దాం


సోనాలలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

మద్నూర్(జుక్కల్): తెలంగాణలో కొనసాగుతున్న బీఆర్ఎస్ అవినీతి పాలనను అంతం చేసే సమయం వచ్చిందని బీజేపీ నాయకులు వ్యాఖ్యానించారు. మండలంలోని సోనాల గ్రామంలో బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. తెలంగాణలో కుటుంబ పాలనతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. ఈ సారి ఎన్నికల్లో కుటుంబ పాలనను అంతం చేసి బీజేపీని ఆశీర్వదించాలని కోరారు. జుక్కల్ నియోజకవర్గ ఆడబిడ్డ, బీజేపీ అభ్యర్థి అరుణతారను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నేతలు సంతోష్, తుకారం, హన్మండ్లు, వెంకట్ తదితరులున్నారు.


నస్రుల్లాబాద్‌లో సంబరాలు చేసుకుంటూ..

బాన్సువాడలో బీజేపీ జెండా ఎగరవేస్తాం

నస్రుల్లాబాద్/బాన్సువాడ: బాన్సువాడలో బీజేపీ జెండా ఎగరవేస్తామని మండల బీజేపీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం బాన్సువాడ, నస్రుల్లాబాద్ మండలాల్లో బాణా సంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. స్వీట్లు పంచుకున్నారు. బాన్సువాడ నియోజకవర్గానికి మాజీ ఎంఎల్‌ఏ యెండల లక్ష్మీనారాయణను పంపడం సంతోషంగా ఉందన్నారు. కలిసికట్టుగా పనిచేసి ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తామన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిమల్ లక్ష్మీనారాయణ, నాయకులు కోనాల గంగారెడ్డి, సున్నం సాయిలు, వడ్ల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ


మాట్లాడుతున్న ఆర్వో భుజంగరావు

బాన్సువాడ: సాధారణ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్లు శుక్రవారం నుంచి స్వీకరించనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి భుజంగరావు తెలిపారు. గురువారం ఆయన తన చాంబర్‌లో మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ప్రకారం ఈ నెల 3 నుంచి 10 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరిస్తారని చెప్పారు. 13న నామినేషన్ల పరిశీలన, 15 వరకు ఉపసంహరణ ఉంటుందన్నారు. 30న పోలింగ్, వచ్చే నెల 3న కౌంటింగ్ ఉంటుందని వివరించారు. నామినేషన్లు వేసేందుకు వచ్చిన అభ్యర్థితో పాటు మరో నలుగురికి అనుమతి ఉంటుందని, 100 మీటర్ల దూరంలోనే ప్రజలు ఉండాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.5 వేలు, ఇతరులు రూ.10 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని అన్నారు. డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, బాన్సువాడ రూరల్ సీఐ మురళి, డీఏవో సువర్ణ ఉన్నారు.

బీఆర్ఎస్‌ను ఓడించడమే ధ్యేయం

- ముదిరాజ్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీల నాగరాజు



భిక్కనూరు: ఒక్క అసెంబ్లీ స్థానంలో కూడా ముదిరాజులకు టికెట్ ఇవ్వని బీఆర్ఎస్ పార్టీని ఓడించడమే ముదిరాజుల ధ్యేయమని ముదిరాజు యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీల నాగరాజు అన్నారు. గురువారం ఇసన్నపల్లిలో నిర్వహించిన ముదిరాజుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కామారెడ్డిలో పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్‌ను ఓడించేందుకు ప్రతి గ్రామం నుంచి నలుగురు ముదిరాజులను పోటీకి నిలబెడతామన్నారు. బీసీ–డి గ్రూపు నుంచి ఏ గ్రూపులోకి ముదిరాజులను మార్చేందుకు సీఎం కేసీఆర్ ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ ఎన్నికల్లో ముదిరాజులు బీఆర్ఎస్‌కు తమ సత్తాను చూపెట్టడం తథ్యమన్నారు. సర్పంచ్ గుడిసె రాములు, ముదిరాజు నేతలు నీరడి అంజనేయులు, కొండ సాయిలు, కొరిమి నాగరాజు, మంద రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ జవాన్ల కవాతు



మాచారెడ్డి: ఎన్నికల నేపథ్యంలో గురువారం మాచారెడ్డి మండల కేంద్రంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఘన్‌పూర్ స్టేజీ నుంచి చౌరస్తా మీదుగా పోలీస్ ఠాణా వరకు సీఆర్పీఎఫ్ జవాన్లు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా కామారెడ్డి డీఎస్పీ ప్రకాష్ మాట్లాడారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కామారెడ్డి రూరల్ సీఐ శ్రీనివాస్, మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ గౌడ్, సిబ్బంది ఉన్నారు.

అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి



బాన్సువాడ: ఈ నెల 30న జరుగనున్న సాధారణ ఎన్నికల ఏర్పాట్లు బాన్సువాడలో పూర్తయ్యాయని డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి అన్నారు. గురువారం బాన్సువాడ ఆర్డీవో కార్యాలయం వద్ద ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఆయన చెప్పారు. అభ్యర్థి వెంట వచ్చే అభిమానులు, కార్యకర్తలు 100 మీటర్ల దూరంలోనే ఉండాలనే నిబంధన ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే ఆర్డీవో కార్యాలయంలోకి అనుమతి ఉంటుందని అన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. సీఐ మురళి ఉన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతు పలికిన కుల సంఘాలు



బాన్సువాడ రూరల్: బాన్సువాడ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా మరోసారి పోటీ చేయనున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డికి సోమేశ్వర్ గ్రామస్తులతో పాటు కోటగిరి, ఎత్తొండ గ్రామాలకు చెందిన వివిధ కుల సంఘాల ప్రతినిధులు మద్దతు పలికారు. గురువారం ప్రత్యేక వాహనాల్లో స్వచ్ఛందంగా తరలి వచ్చిన వీరంతా కుల సంఘం చేసిన ఏకగ్రీవ తీర్మాన పత్రాలను అందజేశారు. నాయకులు అంజిరెడ్డి, అలీమొద్దీన్‌బాబా, వీరేశం పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటా జోరుగా ప్రచారం చేశారు. గురువారం 46, 47వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను చేతి గుర్తుకు ఓటు వేయాలని నాయకులు కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని, ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ఓటర్లకు వివరించారు. సీడీసీ మాజీ చైర్మన్ కారంగుల అశోక్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, కౌన్సిలర్లు పాక జ్ఞానేశ్వరి, పాత శివ కృష్ణమూర్తి, తదితరులున్నారు.

ఉద్యోగ జీవితంలో బదిలీలు సహజం

బాన్సువాడ రూరల్: ఉద్యోగ జీవితంలో బదిలీలు, పదవీ విరమణలు సహజమని ఎక్కడ పనిచేసినా చక్కటి సేవలందిస్తూ గుర్తింపు తెచ్చుకోవాలని దేశాయిపేట్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం పాఠశాలకు చెందిన తిరుమల అనే గణిత ఉపాధ్యాయురాలు దేశాయిపేట్ హైస్కూల్ నుంచి బాన్సువాడలోని బాలికల ఉన్నత పాఠశాలకు బదిలీ అయిన నేపథ్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేందర్, సుంక్య, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

ఆ ఆలయాన్ని దర్శించుకున్న తర్వాతే ప్రచారం

మద్నూర్(జుక్కల్): జుక్కల్ ఎమ్మెల్యే కోసం పోటీలో ఉండే అభ్యర్థులు తప్పకుండా మండలంలోని హనుమాన్ ఆలయంలో పూజలు చేసిన అనంతరమే తమ ప్రచారం ప్రారంభిస్తారు. మూడు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న ఈ ఆలయంలోని హనుమంతుడు ఎంతో మహిమ గల వాడని, ఇక్కడ మొక్కుకుని పని మొదలుపెడితే అంతా శుభం జరుగుతుందని అభ్యర్థుల గట్టి నమ్మకం. అంతే కాకుండా నామినేషన్లు వేయడానికి వచ్చిన వారు సైతం డైరెక్ట్ రిటర్నింగ్ కార్యాలయానికి వెళ్లకుండా ముందుగా సలాబత్‌పూర్ ఆలయానికి వచ్చి స్వామి వద్ద నామినేషన్ల పత్రాలు ఉంచి పూజలు చేసిన అనంతరమే నామినేషన్ దాఖలు చేస్తారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


రాజంపేటలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ సీఈవో వెంకటేశ్వర శర్మ


గండిమాసానిపేటలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు


బీర్కూర్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారి

రాజంపేట: రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రాజంపేట సొసైటీ సీఈవో వెంకటేశ్వర శర్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మానిటరింగ్ అధికారి మమత, తహసీల్దార్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

కాంటా చేసిన వెంటనే మిల్లులకు తరలించాలి

ఎల్లారెడ్డి: ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కాంటా చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని డీసీవో కార్యాలయం సూపరింటెండెంట్‌లు భూమయ్య, ప్రశాంత్‌రెడ్డిలు అన్నారు. గురువారం ఎల్లారెడ్డి, గండిమాసానిపేట, అడివిలింగాల గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. మానిటరింగ్ ఆఫీసర్ రాధిక, సీఈవో విశ్వనాథం తదితరులున్నారు.

నిబంధనలు పాటించాలి

బాన్సువాడ: పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి శ్రావణ్‌కుమార్ అన్నారు. గురువారం బీర్కూర్‌లో ధాన్యం రాశులను ఆయన పరిశీలించారు. తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను రైతులు పాటించాలని, మద్దతు ధర లభించాలంటే నిబంధనలు పాటించాలని అన్నారు. 17 శాతం కన్నా తక్కువగా తేమ కలిగిన ధాన్యంను మాత్రమే తూకం చేస్తామని అన్నారు. సీఈవో విఠల్, కొనుగోలు కేంద్రాల ఇంచార్జ్ నారాయణ తదితరులున్నారు.

గ్యారంటీ పథకాలతో సంక్షేమం సాధ్యం

- ఎల్లారెడ్డి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్ రావు


కాంగ్రెస్ కండువా కప్పుతున్న మదన్‌మోహన్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారంటీ పథకాలతోనే పేద ప్రజల సంక్షేమం సాధ్యమవుతుందని ఎల్లారెడ్డి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు సూచించారు. నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటలో గురువారం నిర్వహించిన గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నాగిరెడ్డిపేట మండల కో–ఆప్షన్ సభ్యుడు షాహెద్‌పాషతోపాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువకులు కాంగ్రెస్ చేరారు. ఈ సందర్భంగా మదన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పై గెలిచి అమ్ముడుపోయిన సురేందర్‌కు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ధర్మారెడ్డి సర్పంచ్ శ్రీధర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే

ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డిరూరల్: బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలు ఒక్కటేనని కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ విమర్శించారు. గురువారం ఎల్లారెడ్డిలో ఆయన సమక్షంలో బీజేపీకి చెందిన సొసైటీ డైరెక్టర్ గోపి, బీజేపీ మండల కార్యదర్శి సాయిబాబాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మదన్‌మోహన్ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పట్టణంలో ఇంటింటి ప్రచారం చేశారు. చెన్న లక్ష్మణ్, ఆరిఫ్, భరత్, పాపయ్య తదితరులున్నారు.

బీఆర్ఎస్ గెలిస్తే పొయ్యిలో పడ్డట్లే


పాల్వంచ మండలం మంతన్ దేవునిపల్లిలో బీజేపీలో చేరుతున్న గ్రామస్తులు


అన్నారంలో..

మాచారెడ్డి: మళ్లీ బీఆర్ఎస్ గెలిస్తే కామారెడ్డి ప్రజల పరిస్థితి పెనమ్మీద నుంచి పొయ్యిలో పడ్డ చందంగా ఉంటుందని కామారెడ్డి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణా రెడ్డి అన్నారు. గురువారం పాల్వంచ మండలం మంతన్ దేవునిపల్లి గ్రామానికి చెందిన 105 మంది యువకులు, మహిళలు రమణారెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి కాషాయ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి ప్రజలు పక్కన ఉన్న సిరిసిల్ల నియోజకవర్గంలోని నేరెళ్ల ఘటనను గుర్తుకు తెచ్చుకొని ఓటేయాలని సూచించారు. నా బొందిలో ప్రాణం ఉండగా బీఆర్ఎస్ అరాచకాలను సాగనివ్వనన్నారు.పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పొన్నాల వెంకట్ రెడ్డి, ఓబీసీ ఉపాధ్యక్షుడు తోట బాల్‌రాజు, మండల శాఖ అధ్యక్షుడు వడ్ల నర్సింహాచారి, నాయకులు బూస సురేష్, శ్రీనివాస్ గౌడ్, స్వామి, భాస్కర్ రెడ్డి, రాములు ఉన్నారు.

రామారెడ్డి మండలం అన్నారం గ్రామస్తుల చేరిక

రామారెడ్డి: అన్నారం గ్రామానికి చెందిన 54 మంది మహిళలతో పాటు మొత్తం 143 మంది కామారెడ్డి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి సమక్షంలో గురువారం కాషాయ కండువా కప్పుకున్నారు. బీజేపీ గెలుపు కోసం పని చేస్తామని పార్టీలో చేరిన వారు పేర్కొన్నారు.

వైభవంగా ఆలయాల దర్శనం


మద్నూర్‌లో వేకువజామున భజనలు చేస్తూ వెళ్తున్న గ్రామస్తులు


ప్రసంగిస్తున్న మహేశ్వర శర్మ సిద్ధాంతి

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో గల అన్ని ఆలయాలకు గ్రామస్తులు నిత్యం భజనలు చేస్తూ దర్శనాలు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా భక్తులు వేకువజామున నుంచి తెల్లవారే వరకు మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా భజన చేస్తూ, పాటలు పాడుతు ప్రభాతఫేరి నిర్వహిస్తున్నారు. నెల రోజుల నుంచి గ్రామస్తులు నిత్యం అన్ని ఆలయాల్లో పూజలు చేస్తున్నారు. 50 ఏళ్లుగా భక్తులు ఈ మాసంలో ఆలయాల దర్శనాలు చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

ఘనంగా శ్రీ పాదుకార్చన

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలో శ్రీ పాదుకార్చన(శ్రీగురుదత్త పాదుకల పూజ) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం సంగారెడ్డి వారి ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ మహేశ్వరశర్మ సిద్ధాంతి దత్త పాదుకార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రవచనాలు చేశారు.

క్లుప్తంగా

బీఆర్ఎస్ ఎన్నికల సమన్వయ కమిటీలోకి మరో నలుగురు

కామారెడ్డి క్రైం: సీఎం కేసీఆర్ పోటీ చేయనున్న కామారెడ్డి నియోజకవర్గంలో భారీ మెజారిటీతో గెలుపే లక్ష్యంగా అధికార పార్టీ ముందుకు వెళ్తోంది. ఇందులో భాగంగా సమన్వయ కమిటీలో మరో నలుగురికి అవకాశం కల్పించారు. తాజాగా బీఆర్ఎస్ ఎన్నికల సమన్వయ కమిటీలో ఇటీవలే పార్టీలో చేరిన ఎంజీ వేణుగోపాల్ గౌడ్, బీబీపేట మండలానికి చెందిన తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డి, సీనియర్ నాయకులు నల్లవెల్లి అశోక్, మామిండ్ల అంజయ్యలకు అవకాశం కల్పించినట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కామారెడ్డి ఎన్నికల ఇన్‌చార్జి శేరి సుభాష్ రెడ్డి గురువారం తెలిపారు.

ఆర్థిక సాయం



భిక్కనూరు: బస్వాపూర్‌లో అనారోగ్యానికి గురై మృతి చెందిన మహిళ కుటుంబానికి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన గుద్దెం బాగవ్వ అనారోగ్యానికి గురై ఇటీవల మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, బాగవ్వ కుటుంబానికి రూ.10 వేలను గురువారం స్థానిక నేతల ద్వారా పంపించి అందజేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుర్రిగోపాల్, నేతలు కర్నాల మల్లేషం, మద్ది స్వామి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన కర్రె మల్లేష్‌కు ఎస్సై గణేష్ గురువారం సెల్ ఫోన్‌ను అందించారు. మల్లేష్ ఫోన్ పోగొట్టుకోవడంతో పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ ఆచూకీని కనిపెట్టి బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

శబరిమాత ఆశ్రమంలో పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు శబరిమాత ప్రతిమ, దివ్య సమాధులను అందంగా అలంకరించారు. అనంతరం భగవన్నామ స్మరణతో పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

'గెలిపించండి.. అసెంబ్లీలో సమస్యలపై గళమెత్తుతా'



బీబీపేట: ప్రజలందరు ఓటు వేసి గెలిపించి అసెంబ్లీకి పంపించాలని, ప్రజా సమస్యలను అసెంబ్లీలో మాట్లాడుతానని బీఎల్ఎఫ్ అభ్యర్థి సిద్ధిరాములు అన్నారు. ఆదివారం తుజాల్‌పూర్‌లో తన ప్రచారాన్ని ప్రారంభించారు. ఇంటింటికి తిరుగుతూ ఓటు వేయాలని కోరారు. ఆంజనేయులు, సాయికృష్ణ పాల్గొన్నారు.

సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్‌కు సన్మానం

భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపాల్‌గా ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సుధాకర్‌గౌడ్‌ను ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులు గురువారం సన్మానించారు. సుధాకర్‌గౌడ్ హయాంలో సౌత్‌క్యాంపస్ ఎంతగానో అభివృద్ధి చెందుతోందని అన్నారు. అధ్యాపకులు బాల్‌కిషన్, కరుణాకర్, విష్ణు, సుదర్శన్, శ్రీధర్, ఇందిర, వీణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద గల బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో గురువారం సైబర్ నేరాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆడ పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను వివరించారు. అఘాయిత్యాలకు గురికాకుండా ఉండేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి విపులంగా చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధిక, ఏఎస్సై నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

బీబీపేట: బీఆర్ఎస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్ అన్నారు. గురువారం ఇస్సానగర్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. గెలుపే లక్ష్యంగా ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త పని చేయాలని సూచించారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, రియల్టర్ తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి, సర్పంచ్ కవిత, ఎంపీపీ బాలమణి పాల్గొన్నారు.